రేషన్ కష్టాలు షురూ..

- చౌక దుకా ణాల వద్ద బారులుతీరిన కార్డుదారులు
- సర్వర్ మొరాయింపుతో పడిగాపులు
- ఎండీయూ వ్యవస్థ రద్దుతో కార్డుదారులకు తప్పని అవస్థలు


చెన్నేకొత్తపల్లిలో ఎండలోనే నిత్యావసరాల కోసం బారులుదీరిన కార్డుదారులు


సాయంత్రం 6 గంటలైనా తలుపులు తీయకపోవడంతో లోనికోటలో స్టోర్ వద్ద పడిగాపులు కాస్తున్న ప్రజలు

ధర్మవరం అర్బన్: ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో కార్డుదారులకు రేషన్ కష్టాలు మొదలయ్యాయి. రేషన్ అందుతుందో లేదోనని భయంతో కార్డుదారులు ఉదయం నుంచే చౌక దుకాణాల వద్ద బారులు తీరారు. సర్వర్ సరిగా పని చేయకపోవడంతో పడిగాపులు తప్ప లేదు. ఇక ఇంటి నుంచి దూర ప్రాంతాలకు వెళ్లి.. అక్కడి నుంచి సరుకులు మోసుకెళ్లేందుకు మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చౌక దుకాణాల్లో బియ్యం తప్ప మిగతా సరుకులు ఇవ్వలేదు.

డీలర్లకు లాగిన్..

గత ప్రభుత్వంలో బ్లూటూత్, తూకం వేసే స్కేల్, మిషన్‌కు కనెక్షన్ పెట్టి బియ్యం ఎంత తూకం వేయాలో అంత ఖచ్చితంగా చూపిస్తేనే మిషన్‌లో ప్రింట్ వచ్చేది. కాని ప్రస్తుత ప్రభుత్వం డీలర్ల లాగిన్ పద్ధతిని ప్రవేశపెట్టింది. అంటే తూకం వేసే స్కేల్‌కు, వేలిముద్ర వేసే మిషన్‌కు ఎలాంటి కనెక్షన్ ఉండదు. స్కేల్‌లో 20 కేజీల బియ్యం బదులు 10 కేజీల బియ్యం పెట్టి డీలర్ వద్దనున్న మిషన్‌లో 20 కేజీలు ఇచ్చినట్లు నమోదు చేసినా ప్రింట్ వస్తుంది. దీంతో డీలర్లు కార్డుదారులను సులువుగా మోసం చేసేందుకు వీలుంది.

రేషన్ పంపిణీకి సర్వర్ సమస్య

కనగానపల్లి: చౌక ధాన్యపు డిపోల ద్వారా జరుగుతున్న రేషన్ సరుకుల పంపిణీలో చాలాచోట్ల మండలంలో సర్వర్ సమస్యలు తలెత్తింది. ఎండీయూ వాహనాలను తొలగించి నేరుగా రేషన్‌షాపుల్లోనే డీలర్ల ద్వారానే సరుకులు పంపిణీ చేస్తున్నారు. దీంతో చాలా మంది డీలర్లకు బయోమెట్రిక్ మిషన్ ఆపరేటింగ్ సరిగా రాకపోవటంతో పాటు ఒకేసారి ఎక్కువ మంది వీటిని వినియోగించటంతో ఆన్‌లైన్ సర్వర్ నెమ్మదించిందని సివిల్ సప్లయ్‌స్ అధికారులు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో తొలిరోజు తక్కువ మందికే రేషన్ సరుకులు అందజేశారు.

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా రేషన్‌షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేయాలనే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఆయా గ్రామాల్లోని రేషన్‌షాపుల వద్దకు కార్డుదారులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఉదయం కొద్దిసేపు సర్వర్ పని చేసినా తరువాత పని చేయకపోవడంతో కార్డుదారులు అసహనం వ్యక్తం చేశారు. ఉదయం ఎండ తీవ్రత ఉండగా ప్రజలు రేషన్ సరుకులు తీసుకునేందుకు ఎండలోనే వేచి ఉండటం కనిపించింది. చెన్నేకొత్తపల్లిలో కొత్త కాలనీలో రేషన్‌షాపు ముందు ఉదయాన్నే క్యూలో నిలుచుకున్నారు. ఇక ఎండ తీవ్రతను తట్టుకోలేక చేసేది లేక పక్కనే లారీ నిలిచి ఉండగా అక్కడ నీడలో పేద తీరారు. గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చిందని పలువురు తెలిపారు. ధర్మవరం ఆర్డీఓ మహేష్ చెన్నేకొత్తపల్లిలోని రేషన్‌షాపును ఆకస్మికంగా పరిశీలించారు.

రేషన్‌షాపు ముందు రేషన్ కోసం వేచి ఉన్న మహిళలతో మాట్లాడారు. సరుకులు సక్రమంగా అందుతున్నాయా? కొలతలు సక్రమంగా ఇస్తున్నారా, రేషన్ దుకాణంలో ఏఏ సరుకులు ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ సావిత్రమ్మ పాల్గొన్నారు.

ఎంత తూకం వేసినా తీసుకెళ్లాల్సిందే



ప్రస్తుతం స్టోర్లలో బియ్యం తూకం లేకపోయినా మిషన్‌లో వేలిముద్ర వేస్తేనే బియ్యం ఇచ్చినట్లు ప్రింట్ వస్తోంది. దీంతో ఎంత తూకం బియ్యం వేసినా ప్రజలు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గంటల కొద్దీ స్టోర్‌ల వద్ద వేచి ఉన్నా కూడా ప్రజలకు దక్కాల్సిన ఖచ్చితమైన తూకం బియ్యం వచ్చేలా కనిపించలేదు.

– అంగజాల నరేష్, గుడ్డిబావివీధి, ధర్మవరం

సర్వర్ పని చేయక ఇబ్బందులు



గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు తీసుకునేవాళ్లం. ఇప్పుడు స్టోర్లకు వెళ్లితే రెండు గంటలు లైన్‌లో ఉన్నా సర్వర్ రాలేదని బియ్యం వేయలేదు. మేము చేనేత మగ్గాలు నేసుకుంటూ జీవిస్తున్నాం. మగ్గం పని వదిలిపెట్టి స్టోర్ వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

– నాగేంద్ర, చేనేత కార్మికుడు, గాంధీనగర్, ధర్మవరం

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయాలి


మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న పొరకల రమణ


మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని కలసిన పుట్టపర్తి నాయకులు

- మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: క్షేత్రస్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేలా ప్రతి కార్యకర్త, నాయకుడు సైనికుల్లా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శిగా నియమితులైన, నల్లమాడకు చెందిన పొరకల రమణ శనివారం పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడానికి ఇప్పటినుంచే ప్రతి ఒక్కరూ కష్టపడాలని సూచించారు. పొరకల రమణ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రెడ్డెప్ప, సర్పంచ్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి షంషీర్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు సలీం, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, యర్ర సూరి, మాజీ పట్టణాధ్యక్షులు గోవిందరెడ్డి, నారాయణస్వామి, నిమ్మల వెంకటేష్, మాధవరెడ్డి, మట్టి జయరామిరెడ్డి, ఆర్‌పీ రెడ్డి, డి.గోవిందరెడ్డి, రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీలో పలు విభాగాల్లో పదవులు దక్కించుకున్న పలువురు నేతలు ఆదివారం పుట్టపర్తిలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని కలసి కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పెడబల్లి బత్తలపల్లికి చెందిన సోమశేఖర్ రెడ్డి, కొత్తచెరువు మండల పబ్లిసిటీ అధ్యక్షుడు లోచర్లకు చెందిన శ్రీనివాసులరెడ్డితో పాటు పలువురు నేతలు మాజీ ఎమ్మెల్యేను కలిశారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఎంపీపీ రమణారెడ్డి, కన్వీనర్ ఈశ్వరయ్య, కొత్తచెరువు కన్వీనర్ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినాన్ని జయప్రదం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, నాయకులు


చెన్నేకొత్తపల్లిలో పోస్టర్ విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పేరుతో సీఎం చంద్రబాబు ప్రజలను మోసం చేసి గద్దెనెక్కి తర్వాత హామీల అమలును విస్మరించారన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 4న అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నియోజకవర్గంలో ఒక్కపనైనా చేశారా?

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఎమ్మెల్యేగా ఎన్నికై ఏడాదైనా నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి పనైనా చేశారా అని ఉషశ్రీచరణ్ ప్రశ్నించారు. ఎంత సేపు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించి జైలుకు పంపడమే సరిపోయిందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఆయన కక్షపూరిత రాజకీయాలు మాని అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవుపలికారు. కార్యక్రమంలో పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పూలశ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి కెవి.ప్రణీత్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు షేక్ బాబ్జాన్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, మండల కన్వీనర్లు రవికుమార్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, ఫయాజ్, ఆశోక్ కుమార్‌రెడ్డి, రంగారెడ్డి, మణికంఠనాయక్, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఖాద్రీశుడిని దర్శించుకున్న ఉషశ్రీచరణ్

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఆదివారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆమె ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేసి శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కెవి.ప్రణీత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: ఎన్నికల హామీలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంత చేద్దామని పలువురు నాయకులు అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4న జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ


ఈశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

ఓడీచెరువు: మండలంలోని అల్లాపల్లి, తంగేడుకుంట పంచాయితీల్లోని బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే దుద్దకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించారు. బోయపల్లికి చెందిన ఈశ్వర్‌రెడ్డి తల్లి దండ్రులు రామచంద్రారెడ్డి, లక్ష్మీదేవమ్మ అనారోగ్యంతో రెండు రోజుల వ్యవధిలో మరణించారు. మాజీ ఎమ్మెల్యే మృతుల ఇంటివద్దకు వెళ్లి వారి కుటుం సభ్యులను పరామర్శించారు. ఇటీవల తంగేడుకుంటకు చెందిన చింతా అంజనేయులు తల్లి చింతా రమణమ్మ, తంగేడుకుంట ఎంపీటీసీ రమణయ్య తల్లి లక్ష్మమ్మ, నల్లచెరువుపల్లికి చెందిన మధుసూదన్‌రెడ్డి తల్లి రామక్రిష్ణమ్మ, బలిజపల్లికి చెందిన పెగోళ్లలక్ష్మీనరసమ్మ భర్త వేమనారాయణ మరణించారు. మృతుల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. చౌడంపల్లికి చెందిన రామాంజనేయులు అనారోగ్యంతో బాధపడుతుండటంతో మాజీ ఎమ్మెల్యే అతడిని పరామర్శించారు. అదే గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన చాంద్‌బాషాను కలసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీరెడ్డి, జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి, నాయకులు షామీర్ బాషా, ఆనంద్ రెడ్డి, ఎద్దుల హనుమంతరెడ్డి, రఫీ, మధు, చింతా వెంకటేశ్, కుర్లి రంగారెడ్డి, మంజునాథ్, శ్రీనివాస్, వీరాంజి, జయసింహ, నరసింహరెడ్డి పాల్గొన్నారు.

అమడగూరు: మలకవారిపల్లిలో ఆదివారం జరిగిన గంగమ్మ జాతరకు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాధవరెడ్డితో కలిసి గంగమ్మ ఆలయానికి వెళ్లి అమ్మవారికి పూజలు చేశారు. గ్రామానికి చెందిన గాదె అనంద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని వారి ఇంటికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తనకంటి జయప్ప, నాయకులు శివశంకర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, హనుమంతరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రంగారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలివ్వడంలో కూటమి ప్రభుత్వం విఫలం

పుట్టపర్తి టౌన్: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య విమర్శించారు. ఆదివారం పట్టణంలోని సాయి ఆరామంలో పార్టీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇళ్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇస్తామని టీడీపీ హామీ ఇచ్చిందన్నారు. అధికారంలో వచ్చి ఏడాదవుతున్నా అమలు చేయడంలేదన్నారు. సోమవారం మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ కాటమయ్య, జిల్లా కార్యదర్శి సహదేవ్, నాయకులు పవన్‌కుమార్, అంజేనేయులు, కదిరప్ప, వినోద్, అంజన్న, బాబు, మూర్తి, మహేంద్ర పాల్గొన్నారు.

కాలభైరవస్వామికి వెండి కళ్లు, కోరమీసాల వితరణ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని వరలక్ష్మి థియేటర్ వద్దనున్న స్వయంభు కాలభైరవస్వామి ఆలయంలో కాలభైరవునికి హేమ నరసింహులు, సంధ్య దంపతులు వెండి కళ్లు, కోరమీసాలు వితరణ చేశారు. ఆలయంలో ఆదివారం పూజారి ధనుంజయ ఆచారికి వాటిని అందించారు.

బైక్ అపహరణ

నల్లచెరువు: చెరువువాండ్లపల్లికి చెందిన పర్వతరెడ్డి బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. వివరాలు.. పర్వతరెడ్డి నల్లచెరువులో నివాసముంటున్నాడు. శనివారం రాత్రి తన ఇంటి ముందు బైక్ పార్క్ చేసి నిద్రపోయాడు. ఆదివారం ఉదయం లేచి చూసేసరికి బైక్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.


ఓడీసీలో సమావేశమైన 1999-2000 బ్యాచ్ విద్యార్థులు


బత్తలపల్లిలో సమావేశమైన 2003-2004 బ్యాచ్ విద్యార్థులు


కనగానపల్లిలో కలిసిన1989-90 బ్యాచ్ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

ఓడీచెరువు/ కనగానపల్లి/ బత్తలపల్లి : ఓడీచెరువు, కనగానపల్లి జెడ్పీహైస్కూళ్లు, బత్తలపల్లి బాలుర ఉన్నత పాఠశాల, ఎస్‌కేజీఎం జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అనంతరం తమకు చదువు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

క్లుప్తంగా

రేషన్ షాపుల తనిఖీ


ముదిగుబ్బలో రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని రేషన్ దుకాణాలను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరుకుల పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేది వరకు రేషన్ సరుకులను పంపిణీ చేయనున్నట్లు జేసీ తెలిపారు. 65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకు వెళ్లి రేషన్ సరుకులను అందించాలని సీఎస్‌డీటి మునిస్వామికి ఆదేశాలు జారీ చేశారు.

పరామర్శ


పెద్దన్న మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న తోపుదుర్తి రాజశేఖరరెడ్డి

చెన్నేకొత్తపల్లి: బసంపల్లి మాజీ సర్పంచ్ పెద్దన్న శనివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకుని పెద్దన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుంటుంబాన్ని పరామర్శించారు. అలాలేగా బసంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శివయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు కొనసాగించాలి


మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు పోలా ప్రభాకర్

ధర్మవరం అర్బన్: ఆర్డీటీ సేవలను కొనసాగించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యువర్స్ ఫౌండేషన్, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు కోరారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం సమావేశాన్ని నిర్వహించి ఆర్డీటీకి సంఘీభావం తెలిపారు. డాక్టర్ సత్యనిర్ధారణ్ మాట్లాడుతూ ఆర్డీటీ మతాలకు అతీతంగా చేస్తున్న సేవలు సఫలీకృతమై కుటుంబ, సామాజిక అభివృద్ధికి దోహదపడ్డాయన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు పోలా ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్డీటీకి నిధులు అందించకుండా కేంద్ర ప్రభుత్వం నిబంధనలు పెట్టడంతో పేదలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అనంతరం పట్టణంలో ఫెర్రర్ చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు శీలా నాగేంద్ర, కృష్ణమూర్తి, కౌన్సిలర్ కేతా లోకేష్, చాంద్‌బాషా, వైకే శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ యజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

కదిరి టౌన్: కుమ్మరవాండ్లపల్లి పెట్రోల్ బంక్‌లో పనిచేసే బాబా ఫక్రోద్దీన్‌ను కట్టేసి కొట్టడం దారుణమని పెట్రోల్ బంక్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జీఎల్ నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మికుడి పట్ల యాజమాన్యం వ్యవహరించిన పద్ధతి అనాగరికమన్నారు. ఏదైనా తప్పు జరిగి ఉంటే విచారించాలి, లేకుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలి కానీ ఇలా స్తంభానికి కట్టేసి కొట్టడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు రామ్మోహన్, ఆంజనేయులు, సుధాకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిని ఓవరాక్షన్


ఉద్యోగినితో మాట్లాడుతున్న స్థానికులు

ధర్మవరం: ఇంట్లో 9 నెలల గర్భిణి ఉందని చెప్పినా వినకుండా సచివాలయ ఉద్యోగిని ఇంటిముందు కాలువను ధ్వంసం చేయించిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని పార్థసారథినగర్‌లో నివసిస్తున్న జయచంద్ర మాట్లాడుతూ తమ ఇంటిలో 9 నెలల గర్భిణీ ఉందని, తమ అమ్మ గుండె ఆపరేషన్ అయ్యిందని ఒక్కరోజు సమయం ఇవ్వాలని చెప్పినా సచివాలయ ఎమినిటీస్ సెక్రటరీ సంధ్య ఆదివారం జేసీబీతో వీధిలోకి వచ్చి ఇంటి ముందు కాలువపైన ఉన్న ర్యాంప్‌ను ధ్వంసం చేయించారన్నారు. కనీసం ఒక్కరోజు కూడా సమయం ఇవ్వలేదన్నారు.

నేటి నుంచి వేరుశనగ రిజిస్ట్రేషన్

అమడగూరు: ఖరీఫ్‌లో విత్తన వేరుశనగ పంపిణీకి సంబంధించి సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభిస్తున్నట్లు ఏఓ వెంకటరమణాచారి ఆదివారం తెలిపారు. రైతులు ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాలకు పాస్‌పుస్తకం, ఆధార్, మొబైల్ తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. 40 శాతం సబ్సిడీ పోగా మిగిలిన మొత్తాన్ని రైతు చెల్లించాల్సి ఉంటుంది. 30 కేజీల బస్తా ధర రూ 1,694, కదిరి లేపాక్షి రకం రూ 1,476 అని పేర్కొన్నారు.

పోలీసుల నాకాబందీ

ముదిగుబ్బ: డీఎస్పీ హేమంత్‌కుమార్ పర్యవేక్షణలో ఆదివారం ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యాంరావు ఆధ్వర్యంలో సమస్యాత్మక గ్రామమైన కొడవండ్లపల్లిలో పోలీసులు నాకాబందీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల ఇళ్లు, గడ్డి వాములు, పాడుబడ్డ ఇళ్లు తదితర చోట్ల సోదాలు చేపట్టారు. అనంతరం గ్రామ సభను నిర్వహించి గ్రామంలో కక్షలకు తావులేకుండా ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలని అవగాహన కల్పించారు.

క్రికెట్ టోర్నీ విజేత శివంపల్లి జట్టు

తాడిమర్రి: శివంపల్లి గ్రామంలో జరుగుతున్న రవితేజ క్రికెట్ టోర్నీ శివంపల్లి జట్టు విజేతగా నిలిచింది. గ్రామానికి చెందిన యువకుడు రవితేజ గత ఏడాది డిసెంబర్‌లో అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మృతుడి బంధు, మిత్రులు అతని జ్ఞాపకార్థం ఈనెల గత నెల 14న రవితేజ క్రికెట్ టోర్నీ ప్రారంభించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 30 జట్లు టోర్నీ పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గొట్లూరు జట్టుపై శివంపల్లిజట్టు గెలుపొందింది. నిర్వాహకులు విన్నర్స్‌కు రూ.40 వేలు, రన్నర్స్ రూ.20 వేలు నగదు బహుమతిని అందించారు. అనంతరం గ్రామస్తులు అందరికి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అల్లే పక్కీరరెడ్డి, కుళ్లాయరెడ్డి, హరినాథ్‌రెడ్డి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీ బదిలీల కౌన్సెలింగ్ పారదర్శకంగా జరపాలి


డీఈఓ కృష్ణప్పకు వినతిపత్రం అందిస్తున్న ఏపీయూఎస్ ఉపాధ్యాయులు

ధర్మవరం: ఎస్‌జీ టీచర్ల బదిలీ కౌన్సెలింగ్ పారదర్శకంగా జరపాలని ఏపీయూఎస్ జిల్లా గౌరవ సలహాదారు అన్నం అరవింద్, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, హిందీ పండిట్ వేణుగోపాల్, రమేష్, నాగేంద్ర కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణానికి ఆదివారం వచ్చిన డీఈఓ కృష్ణప్పను కలిసి వినతి పత్రం అందించారు. బదిలీల విషయంలో ఉపాధ్యాయుల సందేహాలను నివృత్తి చేయాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కౌన్సెలింగ్ జరపాలని కోరారు.

వాల్మీకి బోయ సంఘం నూతన కమిటీ ఎన్నిక

ధర్మవరం అర్బన్: పట్టణంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా తలారి రమేష్, ధర్మవరం పట్టణాధ్యక్షుడిగా దుర్గానగర్ బాబి, ఉపాధ్యక్షుడిగా శీలం అక్కులప్ప, నియోజకవర్గ అధ్యక్షుడిగా సాకే మంజునాథ్, ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడిగా సాకే సత్యానంద్, జిల్లా కార్యదర్శిగా దాసరి రామాంజనేయులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు రామలింగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవ, ఉమ్మడి అనంతపురం జిల్లా యూత్ వింగ్ అధ్యక్షుడు క్రాంతికుమార్, నాయకులు ఆదినారాయణ, ముత్యాలు, చింతకాయల నరేష్, అంగజాల రాజు, బొట్టు క్రిష్టప్ప, నులక రామయ్య, బోయ రవిచంద్ర, శీలం చౌడయ్య తదితరులు పాల్గొన్నారు.

'విద్యారంగాన్ని గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం'

పుట్టపర్తి టౌన్: కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికి వదిలేసిందని, టెన్త్ పరీక్షల్లో మూల్యాంకనమే ఇందుకు నిదర్శనమని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లం రాజేంద్ర ప్రసాద్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యా మంత్రి నారా లోకేష్‌కు తమ ప్రభుత్వంపై గొప్పలు చెప్పుకోవడంలో ఉన్న శ్రద్ధ విద్యారంగంపై లేదని పేర్కొన్నారు. టెన్త్ పరీక్షల మూల్యాంకనంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 66,363 మంది విద్యార్థులు రీవ్యాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోగా 11 వేల మందికిపైగా విద్యార్థులకు మార్కులు పెరిగాయన్నారు. ప్రభుత్వం విద్యార్థుల నుంచి వసూలు చేసిన రీవ్యాల్యూయేషన్ ఫీజును తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు.